క్లుప్తంగా

తెరుచుకోని కార్యాలయాలు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలోని పశువైద్యశాలలకు నిర్లక్ష్య గ్రహణం పట్టింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో పశు వైద్యాధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లోని పశువైద్యశాలలు ఉదయం 9 గంటలకే తెరుచుకోవాల్సి ఉంది. కానీ సోమవారం 9.30 గంటలైనా ప్రత్తిపాడు, పెదగొట్టిపాడు గ్రామాల్లోని వైద్యశాలల తాళాలు తెరుచుకోలేదు. దీంతో మూగజీవాల వైద్యం కోసం వచ్చిన పాడి రైతులు, పశుపోషకులు ఆసుపత్రుల ఎదుట పడిగాపులు కాశారు. సార్లు ఎప్పుడొస్తారో.. తాళాలెప్పుడు తీస్తారో అని ఎదురుచూడాల్సి వచ్చింది. తాళాలు తీసే వారు రాకపోవడంతో సిబ్బంది కూడా బయటే అధికారుల రాక కోసం వేచి ఉండటం గమనార్హం.

యోగాభ్యాసంతో ఆరోగ్యం

ప్రత్తిపాడు: యోగాభ్యాసంతో ప్రజలకు ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. యోగాంధ్ర సంబరాల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు టీవోటీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ జి.కరుణకుమార్, ఎంపీడీవో కె.శివపార్వతిలు ఎంఈవో సీహెచ్.రమాదేవితో కలిసి హైస్కూల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో నమోదు చేసిన టీవోటీలందరూ శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా తదితరులున్నారు.

విద్యార్థులకు టెక్నికల్ స్కిల్స్‌పై శిక్షణ



ప్రత్తిపాడు: ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు టెక్నికల్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అన్నారు. ఐటీ శిక్షణ సంస్థ బైట్ ఎక్సెల్, మలినేని కళాశాల భాగస్వామ్యం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైట్ ఎక్సెల్‌తో కలిసి పనిచేయడంతో విద్యార్థులకు టెక్నికల్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఇంటర్వ్యూలకు అవసరమైన ప్రిపరేషన్, కార్పొరేట్ స్థాయి శిక్షణ లభిస్తుందన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన బైట్ ఎక్సెల్ చీఫ్ సేల్స్ ఆఫీసర్ చరణ్ తాడేపల్లి మాట్లాడుతూ.. డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా బైట్ ఎక్సెల్ తాజా టెక్నాలజీపై ఇచ్చే శిక్షణతో విద్యార్థులకు ఉపకరిస్తుందన్నారు. కళాశాల డైరెక్టర్ డా.దేవిరెడ్డి శ్రీనివాస కుమార్, ప్రిన్సిపాల్ డా.జెట్టి అప్పారావు, అకడమిక్ ప్రొఫెసర్ జంపాని కిషోర్ బాబు, ట్రైనింగ్ ప్లేస్మెంట్ డైరెక్టర్ డా.కె.శ్వేత పాల్గొన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి



పొన్నూరు: మండల ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 8 అర్జీలను స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, సీడీపీఓ వెంకట రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ టీపీ నారాయణస్వామి వివరాల ప్రకారం.. ఈనెల 11వ తేదీన ఆటోనగర్ భారత్ పెట్రోల్ బంక్ నుంచి కారు రోడ్డుపైకి చేరుతుంది. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి పెదకాకాని వైపు వేగంగా వస్తున్న బైక్ కారును ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న బెల్లంకొండ ప్రదీప్(30), ఇటుకల పూర్ణయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రదీప్ 15 రోజుల పాటు మృత్యువుతో పోరాడి పరిస్థితి విషమించడంతో సోమవారం మరణించాడు. మృతుడి బావమరిది యశ్వంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నామమాత్రంగా సీడబ్ల్యూఎస్ఎన్ సర్వే

- గ్రామాలకు వెళ్లకుండా, ప్రత్యేక అవసరాల పిల్లలను చూడకుండానే లెక్కలు
- అంగన్‌వాడీలతో ఫోన్ల ద్వారా వివరాలు సేకరిస్తున్న ఐఈఆర్పీలు



యనమదలలో అంగన్‌వాడీ కార్యకర్త నుంచి చిన్నారి వివరాలు తీసుకుంటున్న ఐఈఆర్పీ

ప్రత్తిపాడు: మండలంలోని యనమదలలో ఓ పాప మానసికంగా బాధపడుతోంది. సర్వే నిబంధనల ప్రకారం ఐఈఆర్పీ గ్రామానికి వెళ్లి ఆ పాప ఇంటిని సందర్శించాలి. ఏ అనారోగ్య సమస్యతో బాధపడుతుందో తెలుసుకొని, భవిత కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులతో పాటు విద్యకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై తల్లిదండ్రులకు వివరించాలి. పాపను స్థానికంగా దగ్గరలో ఉన్న పాఠశాలలో చేర్పించేలా అవగాహన కల్పించాలి. కానీ ఐఈఆర్పీ అలా చేయలేదు. అదే గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వెళ్లారు. అంగన్‌వాడీ కార్యకర్త నుంచి పాప ఆధార్ నంబరు తీసుకుని పాప ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. అంగన్‌వాడీతో మాట్లాడుతున్నట్లు ఓ ఫోటో తీసుకున్నారు. ఫీల్డ్‌లో పాప ఇంటికి వెళ్లకుండానే నామమాత్రపు సర్వే చేపట్టేశారు.

క్షేత్ర స్థాయిలో కనిపించని సర్వే..

గ్రామాల్లోని ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించి, వారిని పాఠశాలల్లో, భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సర్వేను నిర్వహిస్తుంది. మండల కేంద్రాల్లోని భవిత సెంటర్లలో ఉన్న ఐఈఆర్పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు ఈ నెల 13వ తేదీ నుంచి క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి 1 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు, బడిలో చేరని, లేదా గతంలో బడిలో చేరి మధ్యలోనే మానేసిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించాల్సి ఉంది. అంతే కాకుండా విద్య ఆవశ్యకతపై సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారుల తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాల్సి ఉంది. జూన్ 9 వరకు జరగనున్న ఈ సర్వేపై క్షేత్ర స్థాయి పరిశీలన కనబడక నీలినీడలు కమ్ముకున్నాయి.

> ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించడానికి నిర్వహిస్తున్న ఈ సర్వేకు మండల విద్యాశాఖ అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆ మండల విద్యాశాఖ అధికారి రోజూ సర్వేను పర్యవేక్షిస్తూ ఉండాలి. సర్వే పూర్తయ్యే వరకు సర్వే చేసే ఐఈఆర్పీలకు ఏ పనులూ అప్పగించకుండా సర్వే చేయించాల్సి ఉంది. కానీ ఐఈఆర్పీలపై ఎంఈవోలకు కనీస పట్టుగానీ, పర్యవేక్షణ గానీ లేక పోవడంతో సర్వే ఇష్టారాజ్యంగా సాగుతోందన్న విమర్శలు వినబడుతున్నాయి.

ఫోన్‌లోనే సర్వే చేసి..

జిల్లా కేంద్రం నుంచి వికలాంగ పింఛను పొందుతున్న వారి జాబితాలను ఉన్నతాధికారులు భవిత కేంద్రాలకు పంపారు. ఐఈఆర్పీలు ఆ డేటాను పరిశీలించి, వారిలో ఇప్పటికే స్కూల్స్‌లో ఉన్నవారి వివరాలను క్రాస్ చెక్ చేసుకుని అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. స్కూల్స్‌లో లేని వారి పిల్లల ఇంటికి వెళ్లి పూర్తి సమాచారం తీసుకొని వారిని ఎన్‌రోల్ చేయించాలి. అదే విధంగా అంగన్‌వాడి సెంటర్లకు వెళ్లి వారి పరిధిలో సీడబ్ల్యూఎస్ఎన్ (చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్) పిల్లలు ఉంటే వారి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలను తీసుకోవాల్సి ఉంది. అలానే సచివాలయ కేంద్రాలను సందర్శించి, వెల్ఫేర్ అసిస్టెంట్లను కలిసి వారి వద్ద ఉన్న సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల డేటాను తీసుకోవాలి. కానీ ఇవేమీ చేయకుండా మండల కేంద్రంలోనో లేక జిల్లా కేంద్రాల్లోనో కూర్చుని ఐఈఆర్పీలు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్లు చేసి వారి వద్ద నుంచి సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల ఆధార్ నంబర్లు, ఆరోగ్య సమాచారం తెలుసుకుని సర్వేను మమ అనిపించేస్తున్నారు.

> **సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల ఇంటికి వెళ్లాల్సిందే..**
>
> ఐఈఆర్పీలు బడి బయట ఉన్న సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల ఇంటికి కచ్చితంగా వెళ్లాల్సిందే. ఇప్పటికే ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. పెన్షనర్ల జాబితాలు పంపాం. వాటిని చెక్ చేసుకోవడం, అంగన్‌వాడీలు, సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల వద్ద ఉన్న డేటా తీసుకుని సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల ఇంటికి వెళ్లడం చేయాలి.
>
> – ఎస్. శ్రీనివాసరావు, ఐఈ, జిల్లా కోఆర్డినేటర్

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

కాకుమాను: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్.కెనడీ అన్నారు. సమగ్ర శిక్షా ఆదేశాల మేరకు బడి ఈడు పిల్లలను గుర్తించేందుకు సోమవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ విద్యను ముగించుకున్న చిన్నారులందరినీ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయాలని కోరారు. విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ టీచర్ దయమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై నేడు నగరంలో ర్యాలీ

నెహ్రూనగర్: యోగాంధ్ర–2025లో భాగంగా బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పి.శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ర్యాలీ ఉంటుందన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు



ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థులు

ప్రత్తిపాడు: తమ కళాశాల విద్యార్థులకు ఉత్తమ ప్యాకేజీతో ఉద్యోగావకాశాలు లభించడం హర్షణీయమని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా.కె.జగదీష్‌లు అన్నారు. ఆర్‌వీఆర్‌జేసీలో హెచ్ఎస్‌బీసీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రూ.9 లక్షల ప్యాకేజీతో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని అన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కళాశాలలో వారిని కళాశాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాంగణ ఎంపికల్లో ఇటీవల ఏడుగురు విద్యార్థులకు ఇదే బ్యాంకులో ఉద్యోగాలు లభించాయని.. తాజాగా మరో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారని అన్నారు. కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రాంగణ ఎంపికల్లో వందల మంది విద్యార్థులకు ఉద్యోగాలు రావడం వారి ప్రతిభా నైపుణ్యాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అకాడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డా.కె.రవీంద్ర మాట్లాడుతూ తమ కళాశాల సీఎస్ఈ విభాగం విద్యార్థులు ఎ.సాయిదుర్గ, సీహెచ్.లావణ్య, సీహెచ్.లక్ష్మిశ్రీ, సీఎస్‌బీఎస్ విభాగంలో జి.దివ్య బ్యాంకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రోల్ ఉద్యోగానికి ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.ఎ.ఎన్.వి శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు సీహెచ్.శ్రీనివాసరావు, డా.కె.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి



కాకుమాను: నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం పార్టీ సీనియర్ నాయకులు జంపని రామారావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ.. మండలంలో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి రైతులు నల్లబర్లీ సాగు చేశారని అన్నారు. గత మూడేళ్లుగా అధిక దిగుబడి, మంచి ధర ఉండడంతో ఈ ఏడాది కూడా కౌలు రైతులు అధిక మొత్తంలో నల్లబర్లీ సాగు చేశారని అన్నారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర లేకపోవడంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే పొగాకుకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్, ముద్దన వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, మర్రి లక్ష్మీ, భువనేశ్వరి, నల్లమోతు రాజేంద్ర, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు అధికారులు గైర్హాజరు



ఉదయం 11 గంటలకు హాజరైన కొన్ని శాఖల అధికారులు

ప్రత్తిపాడు: మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటల్లోపు కేవలం వెలుగు ఏపీఎం లాజరు, ఇన్‌చార్జి సీడీపీవో విజయనిర్మల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, ఏవో అరుణకుమారి.. విద్యాశాఖ నుంచి సీఆర్పీ శ్రీనివాస్‌లు హాజరయ్యారు. 11 గంటల తరువాత ఎంపీడీవో కె.శివపార్వతి, పీఆర్ ఏఈలు.. 11.30 గంటలకు తహసీల్దార్ కరుణకుమార్ పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. కాగా వైద్యశాఖ, దేవాదాయ, ఎక్సైజ్, ఉపాధి హామీ, పశుసంవర్థకశాఖ, డ్రైనేజీ, కార్మికశాఖ, అటవీశాఖ, ఉద్యానశాఖ, వంకాలయపాడు మేజర్, సంక్షేమ వసతి గృహాల ఇన్‌చార్జిలు, విద్యుత్‌శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రీవెన్స్‌కు అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరైతే ఫిర్యాదు దారుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే వెసులుబాటు ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఈకేవైసీ కోసం నానా అవస్థలు

దరఖాస్తు దారులను సర్వర్ పేరుతో తిప్పుకొంటున్న వైనం

ప్రత్తిపాడు: కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారు ఈకేవైసీ కోసం నానా అవస్థలు పడుతున్నారు. సర్వర్ రాకపోవడంతో పాటు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా దరఖాస్తు దారులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమవారం ఉదయం కొందరు దరఖాస్తు దారులు ఈకేవైసీ కోసం వెళితే మధ్యాహ్నం రమ్మని.. మధ్యాహ్నం వెళితే సాయంత్రం రమ్మని, సాయంత్రం వెళితే మర్నాడు రమ్మని.. ఇలా సిబ్బంది నానా ఇబ్బందులూ పెడుతున్నారని వాపోయారు. ప్రత్తిపాడుకు చెందిన పి.గురవయ్య 15 రోజుల నుంచి ఈకేవైసీ కోసం తిరుగుతున్నారు. మామిడి సరోజనరావు వేలిముద్ర వేస్తే గానీ కార్డులో యాడ్ అవ్వరని చెప్పడంతో అదే పనిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గుంజా మల్లేశ్వరి సోమవారం రేషన్ కార్డు కోసం అప్లికేషన్ పెట్టుకున్నారు. సర్వర్ రావడం లేదంటూ ఆమెను సాయంత్రం వరకూ ఉంచి సిబ్బంది వెనక్కి పంపించేశారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చలపతి ఫార్మశీ కళాశాలలో జాబ్ మేళా



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలం లాం చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో సోమవారం ఫార్మశీ కంపెనీలు మెగా జాబ్ మేళాను నిర్వహించాయి. జాబ్ మేళాకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి బీఫార్మసి, ఎంఫార్మసి, బీఎస్‌సీ, ఎంఎస్‌సీ, డిప్లొమా, ఐటీఐతో పాటు డిగ్రీ విద్యార్హత కలిగిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి నాట్కో, హెటిరో, అరబిందో కంపెనీలు తొలుత రాత పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్ ఆర్ రౌండ్‌లు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులను నాట్కో ఫార్మా కంపెనీ.. 30 మందిని హెటిరో ఫార్మా కంపెనీ.. 20 మందిని ఎస్ఎస్ఎస్‌పీ ఫర్ అరబిందో కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మా కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ రంజిత్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ యు.సుమంత్, డిప్యూటీ అసిస్టెంట్ మేనేజర్ కె.గోపీకృష్ణ, హెటిరో ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ కె.సమీర్‌కుమార్, ఎస్ఎస్ఎస్‌పీ ఫర్ అరబిందో హెచ్‌ఆర్ మేనేజర్ ఫైసల్, సీనియర్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కె.త్రివిక్రమ్‌లు, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పాల్గొన్నారు.

రఘుపతి వెంకటరత్నంను ఆదర్శంగా తీసుకోవాలి



గుంటూరు రూరల్: విద్యావేత్త, బ్రహ్మ రుషి, సామాజిక సుధారకుడు రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతిని తెలగ అభ్యుదయ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాపు నాయకులు బాలిశెట్టి విజయకుమార్, డెగల వెంకటేశ్వరరావు, వూరిబండి శ్రీక్రాంత్ మాట్లాడుతూ.. రఘుపతి వెంకటరత్నం మహిళా విద్యను ప్రోత్సహించడంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. విద్యను ఒక సాధనంగా భావించి సమాజాన్ని మార్పు దిశగా నడిపించిన మహానుభావుడు రఘుపతి వెంకటరత్నం అన్నారు. విద్యార్థులు ఆయన సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కూటాల కృష్ణ, ఊరుబండి కృష్ణమూర్తి, శ్రీగిరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పల్లెనిద్రతో పోలీసుల భరోసా



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరయ్య, సిబ్బంది

పట్నంబజారు: ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, లాలాపేట, పాత గుంటూరు పోలీసు స్టేషన్ల పరిధిలో సోమవారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓల ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో జరిగిన పల్లెనిద్ర కార్యక్రమానికి డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్యచౌదరి హాజరయ్యారు. స్థానికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ ఎల్ఆర్ కాలనీలో జరిగిన పల్లెనిద్రలో పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిద్రించారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని యాదవ హైస్కూలులో పల్లె నిద్ర కార్యక్రమాన్ని ఎస్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్, ఎస్ఐలు నిర్వహించారు.

కుట్ర పూరిత చర్యలను ఐక్యంగా ఎదుర్కొందాం

లక్ష్మీపురం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని మాయమాటలు చెబుతూ ప్రైవేటీకరణ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన పెద్దఎత్తున సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ 4,000 మంది కాంట్రాక్టర్ కార్మికులను విధుల నుంచి తొలగించి, మరో 2,500 మందిని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. 1,200 మంది పర్మినెంట్ కార్మికులను బలవంతంగా వీఆర్ఎస్ తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకు వస్తున్నాయని తెలిపారు. మోసపూరిత చర్యలను తక్షణమే ఆపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ దరఖాస్తుల కోసం ఏర్పాట్లు



దరఖాస్తులను ఆన్‌లైన్ చేయిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులు సమర్పించేందుకు మంగళవారం గడువు ముగియనుండటంతో యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తులను దాఖలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లాంగ్ స్టాండింగ్ విభాగంలో తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారితో పాటు సాధారణ బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు మంగళవారం సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా దరఖాస్తు దాఖలు చేయాలని, సమస్యలు ఉన్నట్లయితే అనంతరం గ్రీవెన్స్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయులకు ఉచితంగా సేవలు అందించేందుకు యూటీఎఫ్ కార్యాలయంలో ఆన్‌లైన్ దరఖాస్తు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు జి. వెంకటేశ్వరరావు, బి. ప్రసాద్, ఎం. కోటిరెడ్డి, వి. వినోద, షేక్ గఫార్ పాల్గొన్నారు.

సూర్యకుమార్ ప్రజ్ఞ, మేధాశక్తి ప్రశంసనీయం

మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



సూర్యకుమార్ దంపతులను సత్కరిస్తున్న లక్ష్మణరావు, యూటీఎఫ్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతమైన డిగ్రీలు లేకపోయినప్పటికీ రెండుసార్లు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన పూసపాటి కృష్ణ సూర్యకుమార్ మేధాశక్తి, ప్రజ్ఞా పాటవాలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. 70 ఏళ్ల వయసులో వాట్సాప్ మాధ్యమం ద్వారా తన అర్థమెటిక్ ఫార్ములాతో ఎమ్మెస్ ఎక్సెల్ షీట్ ద్వారా 10,48,574 గడులలో అంతే సంఖ్యలో కేవలం ఒక్క గంటలో జవాబులు రాయడం ప్రశంసనీయమని తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన కృష్ణ సూర్యకుమార్‌ను సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అభినందించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వాట్సాప్ ద్వారా తెలుగు పద్య రచనపై వందలాది మంది తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ అందించిన కృష్ణ సూర్యకుమార్ ప్రతిభ అద్భుతమన్నారు. ఆయన త్వరలో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కృష్ణ కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రత్యేక శ్రద్ధతో తాను చేసిన ప్రయోగం, కృషికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పూర్తిస్థాయిలో సంతృప్తి చెంది, తనకు ప్రత్యేకంగా గుర్తింపు అందించారని చెప్పారు. వెయ్యి మంది ఉపాధ్యాయులకు పద్య రచనపై శిక్షణ అందించానని తెలిపారు. కార్యక్రమంలో పూసపాటి నాగమణి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, వెలగా వినోద్, వాసుదేవశర్మ, రాధాకృష్ణమూర్తి, ఓంకార్స్ రాము, ఏక వెంకటరామయ్య, దామరాజు రవి పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో ముగ్గురికి ఉద్యోగాలు

లక్ష్మీపురం: కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామకంలో భాగంగా కొటికల సాల్మన్ రాజు, రుంజల రవిసాగర్, పద్మ సాయి నిఖిలకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజలను వ్యవసాయ శాఖలో జూనియర్ ఆఫీసు అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. నిబంధనల మేరకు డ్యూటీకి రిపోర్ట్ చేయాలని ఆయన తెలిపారు.

తెనాలి పోలీసులను సస్పెండ్ చేయాలి

లక్ష్మీపురం: మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డ తెనాలి పోలీసులను సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. కొత్తపేట జిల్లా సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. పట్టణంలో ముగ్గురు వ్యక్తులు చేసిన నేర ఆరోపణపై పోలీసులు చేసింది మాత్రం కచ్చితంగా నేరమేనని తెలిపారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ



పట్నంబజారు : రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొట్టుకున్న సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాలు ప్రకారం .. హిందూ కళాశాల కూడలిలో సోమవారం సాయంత్రం రెండు బస్సుల డ్రైవర్లు ఎత్తు రోడ్డు సెంటర్ వైపు నుంచి వస్తూ పోటీ పడ్డారు. ఈ ఘటనలో రెండు బస్సులు స్వల్పంగా ఢీకొట్టుకున్నాయి. ప్రయాణికులకు ప్రమాదం జరగలేదు. డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనం నడపడంపై పలువురు మండిపడ్డారు.

మందలించారని యువకుడు ఆత్మహత్య

పట్నంబజారు: మద్యం తాగవద్దని భార్య, తల్లి మందలించడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జానినిత్యంజయనగర్‌కు చెందిన ఎం.సాయికుమార్(24) సోమవారం తాగొచ్చి భార్యతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనూష మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: నగరంలోని గుంటూరువారితోటలో నివసించే రజక మహిళ అనూష అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ధోబీఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలసి విన్నవించారు. గర్భవతి అయిన అనూషకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆమె భర్తను, చనిపోవడానికి కారణమైన ఓ ప్రైవేట్ హాస్పిటల్ వైద్యురాలిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.